సరుగుడు రైతులకు సిరులు

- టన్ను రూ. 9,500 పెరిగిన ధర
- ధర ఆశాజనకంగా ఉండటంతో పెరిగిన సాగు విస్తీర్ణం
- నియోజకవర్గంలో 20 వేలకు పైగా ఎకరాల్లో సాగు


బుచ్చెయ్యపేటలో సాగవుతున్న సరుగుడు తోటలు

బుచ్చెయ్యపేట : సరుగుడు తోటలు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. ధర పెరగడంతో రైతులకు లాభాలు కురిపిస్తున్నాయి. పెరిగిన ధరతో పలు గ్రామాల రైతులు సరుగుడు సాగుపై మక్కువ పెంచుకుని విస్తారంగా సాగు చేస్తున్నారు. గతంలో ఎకరా విస్తీర్ణంలో సరుగుడు తోట విక్రయించగా లక్ష రూపాయలు కూడా ఆదాయం రాకపోగా ఇపుడు పెరిగిన ధరతో ఎకరాకు సుమారు రూ.నాలుగు లక్షల వరకు రైతులకు ఆదాయం వస్తోంది. పెట్టుబడికి తగ్గ ఆదాయం రావడంతో రైతులు సరుగుడు తోటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తింపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో సరైన సాగునీటి వనరులు లేకపోవడంతో పెదపూడి, మల్లాం, తురకలపూడి, కరక, సీతయ్యపేట, చింతపాక, రాజాం, భీమవరం, శివరాంపురం,పెదమదీన,గున్నెంపూడి తదితర గ్రామాల రైతులు సరుగుడు తోటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా రాయగడ,భద్రాచలం,రాజమండ్రి తదితర ప్రాంతాల్లో ఉన్న కర్రల ఫ్యాక్టరీల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి సరుగుడు ధరలు పెంచకుండా చేశారు. దీంతో ఈ ప్రాంత రైతులు సరుగుడు తోటలు సాగు విస్తీర్ణం తగ్గించేశారు. గతంలో బుచ్చెయ్యపేట, చోడవరం, రావికమతం, రోలుగుంట మండలాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో మాత్రమే సరుగుడు తోటలు సాగు చేసేవారు. రైతులు సాగు తగ్గించేయడంతో ఫ్యాక్టరీలకు అవసరమైన కర్ర సరఫరా తగ్గిపోయింది. రెండేళ్ల కాలంగా ఫ్యాక్టరీల యాజమాన్యం దిగివచ్చి సరుగుడు ధర పెంచుతూ వస్తున్నారు.

రూ, 2,500 నుంచి 9,500 వరకు

సరుగుడు ధర ప్రస్తుతం ఆశాజనకంగా మారింది. ఏడేళ్లగా టన్ను రూ, 2,500 నుంచి రూ. 2,800 మధ్యన ధర ఉండేది. రైతులకు ధర గిట్టుబాటు అయ్యేది కాదు. ఎకరా విస్తీర్ణంలో సరుగుడు మొక్కలు నాటడానికి సాగు చేయడానికి రైతుకు రూ. 50 వేలు వరకు పెట్టుబడులు అయ్యేవి. ఐదేళ్లపాటు సరుగుడు తోటలు పెంచి విక్రయించిన రైతుకు ఎకరాకు రూ, 80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఆదాయం వచ్చేది. ఏడాదిన్నర కాలంగా సరుగుడు తోటల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం 6 అడుగుల ముక్క ధర టన్నుకి రూ, 9,200 ఉండగా 10,12,18 అడుగుల బాజు రూ.9,800 వరకు పలుకుతోంది. సాధారణంగా సరుగుడు తోటలు ఎకరాకు 45 నుంచి 70 టన్నుల దిగుబడి వస్తోంది. దీంతో పెరిగిన ధరతో సుమారు రూ.నాలుగు లక్షలు వరకు రైతులకు ఆదాయం వస్తోంది. దీంతో పలు గ్రామాల రైతులు చెరకు, వరి ఇతర పంటకన్న సరుగుడు తోటలు పెంపకంపై ఆసక్తి చూపి విస్తారంగా సాగు చేస్తున్నారు. బుచ్చెయ్యపేటతో పాటు చోడవరం నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో రైతులు 20 వేల ఎకరాల వరకు సరుగుడు తోటల పెంపకం చేపడుతున్నారు.


రాజాం కాటా వద్ద లారీపై తరలిస్తున్న సరుగుడు లోడు

ఎకరాకు రూ.4 లక్షల ఆదాయం



సరుగుడు ధర ప్రస్తుతం బాగుంది. గతంలో ఎకరాకి లక్ష రూపాయల వరకు మాత్రమే ఆదాయం రాగా ప్రస్తుతం పెరిగిన ధరతో ఎకరాకు రూ.నాలుగు లక్షల వరకు ఆదాయం వస్తోంది. నాకున్న సొంత భూమితో పాటు మరో 25 ఎకరాలు లీజుకు తీసుకుని సరుగుడు సాగు చేపట్టాను. ప్రభుత్వం సరుగుడుకు గిట్టుబాటు ధర ఉండేలా చర్యలు చేపట్టాలి.

– సయ్యపురెడ్డి కొండబాబు, సరుగుడు రైతు వడ్డాది

సాగును ప్రోత్సహించాలి



గతంలో ఫ్యాక్టరీలు రైతులకు ఉచితంగా మొక్కలు అందించి సరుగుడు తోటలు పెంపకానికి ప్రోత్సాహం అందించేవి. ఇపుడు ఫ్యాక్టరీ యాజమాన్యాలు సిండికేట్‌గా మారి ఉచితంగా మొక్కల సరఫరాను నిలిపి వేయడమే కాక సరుగుడు ధరలు వారి ఇష్టానుసారంగా నిర్ణయిస్తున్నారు. ప్రభుత్వం సరుగుడుకు మద్దతు ధర నిర్ణయించి రైతులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలి.

–ముచ్చకర్ల అప్పారావు, గున్నెంపూడి రైతు

ధర బాగుంది..



ప్రస్తుతం సరుగుడు తోటలకు ధర బాగుంది. టన్నుకి రూ, 9,200 నుంచి 9,500 వరకు ధర రైతులకు చెల్లిస్తున్నాం. రాయగడ ఫ్యాక్టరీకి మా సరుకంతా పంపిస్తున్నాం. రైతుకు ఎకరాకి నాలుగు లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. సరుగుడు ధరలు బాగున్నాయి. సరుగుడు ధరలు తగ్గడం, పెంచడం మా చేతుల్లో లేదు. ఫ్యాక్టరీలు చెల్లించిన ధరలకు అనుకూలంగా రైతులకు మేం చెల్లిస్తున్నాం.

– ఐయితరెడ్డి చినబాబు, సరుగుడు వ్యాపారి, ఐయితంపూడి

క్లుప్తంగా

డీటీ శంకరరావు బాధ్యతల స్వీకారం



రోలుగుంట : రోలుగుంట డిప్యూటీ తహసీల్దార్‌గా కోట శంకరరావు శనివారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన సోమశేఖర్ నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం బదిలీ కాగా అక్కడ పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కె.శంకరరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

జైభీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



నర్సీపట్నం : జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నర్సీపట్నంకు చెందిన నేతల నాగేశ్వరరావు నియమితులయ్యారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జె.శ్రావణ కుమార్ చేతుల మీదగా నియామక పత్రాన్ని అందుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షులకు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

తహసీల్దార్‌కు ఆత్మీయ వీడ్కోలు

మాకవరపాలెం: బదిలీపై వెళుతున్న తహసీల్దార్‌కు ఘన వీడ్కోలు పలికారు. ఇప్పటివరకు మాకవరపాలెం తహసీల్దార్‌గా పనిచేసిన ప్రసాద్‌కు ఇటీవల జరిగిన బదిలీల్లో అరకు బదిలీ అయింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ప్రసాద్‌కు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, రాజకీయ పార్టీల నేతలు సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిటి సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు


ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వర్రావు

రోలుగుంట : గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన వద్దాది సూర్యనాగేశ్వర్రావు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కె.ప్రభాకర్రావు బదిలీ కాగా, ఆ స్థానంలో కృష్ణా జిల్లా గుడివాడ మండలం నందివాడలో పనిచేస్తున్న వి.ఎస్.నాగేశ్వర్రావు ఇక్కడకు బదిలీ అయ్యారు. శుక్రవారం విధుల్లో చేరిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి నిధులను సద్వినియోగం అయ్యేలా చూస్తానని, అర్హులకు సంక్షేమ పథకాలు అందించేలా చూస్తానని, మండలంలో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేస్తానని తెలిపారు.

పెయ్యిలపై కుక్కల దాడి


కుక్కల దాడిలో గాయపడ్డ పెయ్యి

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారం గ్రామానికి చెందిన రైతు బోను సత్యనారాయణమూర్తికి చెందిన రెండు పెయ్యిలపై శనివారం కుక్కలు దాడి చేసాయి. ఈ దాడిలో రెండు పెయ్యిలు తీవ్ర గాయాలయ్యాయి. ఉదయాన్ని పాక నుండి పశువులకు మేత వేసి, నీటిని అందించి రైతు ఇంటికి వెళ్లాడు. పాక వద్ద ఎవరూ లేని సమయంలో గుంపులుగా వచ్చిన కుక్కలు రెండు పెయ్యిలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో అవి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్టు ఆ రైతు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి


పేకాట అడుతున్న వారిని పట్టుకుని నగదు లెక్కిస్తున్న నాతవరం ఎస్‌ఐ భీమరాజు

నాతవరం : మండలంలో మన్యపురట్ల గ్రామ సమీపంలో పేకాట అడుతున్న వారిపై శనివారం నాతవరం ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు సిబ్బందితో దాడి జరిపారు. నలుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1540 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడ పేకాట, పందాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ భీమరాజు అన్నారు.

నేడు కింతలిలో ఎన్‌ఎల్‌ఎం ఫీల్డ్ విజిట్

మాడుగుల : కింతలి గ్రామంలో ఆదివారం ఎన్‌ఎల్‌ఎం ఫీల్డ్ విజిట్ జరుగుతుందని, ఎంపీడీవో కె.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 వ తేదీన సత్యవరం గ్రామంలో జరుగుతుందన్నారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పరిశీలిస్తారన్నారు. ఎంజి ఎన్‌ఆర్‌జీఎస్, పనులు, ఎస్‌హెచ్‌జీ, తదితర పథకాల ద్వారా అమలు జరుగుతున్న పనులు ప్రస్తుతం ఎలా ఉన్నాయో స్పష్టంగా పరిశీలించి, ఇంకా మెరుగైన విధంగా ఎలా అమలు చేయాలో గ్రామస్తుల నుంచి సమాచారం సేకరించి కేంద్రానికి నివేదిక పంపించనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని, ఎంపీడీవో కోరారు.

గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యం


కె.కోటపాడు ఆసుపత్రి వద్ద పారిశుధ్య పనులపై సూచనలు చేస్తున్న అప్పలరాజు

కె.కోటపాడు : మండలంలో అన్ని పంచాయతీల్లో పరిశుభ్రతా పనులకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు అన్నారు. కె.కోటపాడు 50 పడకల ఆస్పత్రి, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ పరిసరాల్లో శనివారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి, బ్లీచింగ్ చల్లించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారిణి జి.రమణి, పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్‌ సిక్స్ పథకాలన్నీ ఒకేమారు అమలు చేయాలి


చౌడువాడలో సీపీఎం నాయకులతో మాట్లాడుతున్న నాయినిబాబు

కె.కోటపాడు : సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా కాకుండా అన్నింటిని ఒకే మారు అర్హులకు అందించాలని సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు కోరారు. చౌడువాడలో శనివారం సీపీఎం శాఖ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండా ఆవిష్కరణను నాయినిబాబు నిర్వహించారు. ఉచిత ఇసుక ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయినట్టు నాయినిబాబు అన్నారు. అర్హులైన వారికి వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ పెన్షన్‌లను మంజూరు చేయడంతో పాటు ఇళ్ల లేని కుటుంబాలకు ఇంటిస్థలం, స్కీంను వర్తింపజేయాలని నాయినిబాబు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు రొంగలి ముత్యాలనాయుడు, యర్రా దేముడు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

దేవరాపల్లి: ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. దేవరాపల్లిలో శనివారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి బి.టి.దొర పాల్గొన్నారు.

సూదివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సాయికిరణ్

కె.కోటపాడు : వాతావరణ పరిస్థితులు మారడం వల్ల ప్రజలకు వ్యాధులు సోకే పరిస్థితులుండడం వల్ల వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ అన్నారు. సూదివలసలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలు చేశారు. 133 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలతో పాటు జాగ్రత్తలు తెలిపారు. పౌష్టిక విలువలు గల ఆహారాన్ని గర్భిణులు తీసుకోవడం వల్ల తల్లి, బిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ నర్సింహమూర్తి, ఏఎన్‌ఎం అనురాధ పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో రంధ్రం...జర భద్రం


తాత్కాలికంగా రంధ్రంలో తాటాకు పెట్టిన స్థానికులు

నాతవరం : రెండు జిల్లాలను అనుసంధానం చేసే సరిహద్దు రోడ్డుకు మధ్యలో రంధ్రం ఏర్పడింది. ఈ రహదారి మండల కేంద్రం నుంచి పెదగొలుగొండపేట గునుపూడి మీదుగా కాకినాడ జిల్లా రవతలపూడి నుంచి కత్తిపూడి చేరుకుంటుంది. ఈరోడ్డులో గునుపూడి గ్రామ సమీపం చెరువు గట్టుపై అర్‌అండ్‌బీ రోడుకు మధ్యలో ఇటీవల కురిసిన వర్షాలకు భారీ రంధ్రం పడింది. సుమారుగా 10 అడుగులు లోతులో తారురోడ్డు మధ్యలో రంధ్రం పడడంతో రాత్రి వేళల్లో ప్రయాణించేవారు దీనిని గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానికులు అక్కడ హెచ్చరికగా తాత్కాలికంగా తాటాకు కొమ్మ ఉంచారు. అధికారులు స్పందించి యుద్ధప్రతిపాదికన రంధ్రం పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహిళా భక్తులకు చీరల పంపిణీ



మహిళా భక్తులకు చీరలు అందిస్తున్న నారాయణపాత్రుడు

కె.కోటపాడు : సత్యసాయిబాబా సూచించిన సేవామార్గంలో భక్తులు కొనసాగాలని కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు అన్నారు. కె.కోటపాడు గ్రామంలో గల 50 మంది సత్యసాయి మహిళా భక్తులకు నారాయణపాత్రుడు తన సొంత నగదుతో కొనుగోలు చేసిన చీరలను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిభావంతో మానసిక ప్రశాంతత చేకూరుతందని అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

మాడుగుల రూరల్ : ప్రతి విద్యార్థి తమ లక్ష్యాన్ని సాధించడం కోసం అను నిత్యం కృషి చేస్తే, మంచి ఫలితం పొందవచ్చునని తహసీల్దారు కె. రమాదేవి పేర్కొన్నారు. మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ శాస్త్రి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో తమ కళాశాలల్లో 140 మంది కొత్తగా చేరారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. కళాశాల సీపీడీసీ చైర్మన్ శ్రీనాధు శ్రీనివాసరావు, కార్యదర్శి దంగేటి సూర్యారావు, వసతి గృహ సంక్షేమాధికారులు ఎం.దేవి, కె. శైలజ, వైస్ ప్రిన్సిపాల్‌జయలక్ష్మి, ఉపన్యాసకులు పులపర్తి పైడిరాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాల నుంచి రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఉన్నత విద్యకు చేరుకున్న విద్యార్థులను సత్కరించారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గమ్మతల్లి


నర్సీపట్నం : అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గాదేవి

చోడవరం : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చోడవరం పాతబస్టాండ్ దగ్గర వేంచేసియున్న శ్రీ దుర్గాదేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం సహస్ర కూరగాయల అలంకరణతో అన్నపూర్ణాదేవిగా దుర్గాదేవి అమ్మవారిని అలంకరించారు. అన్నపూర్ణాదేవి అమ్మవారి హోమం జరిపారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శివ ప్రత్యేక పూజలు చేశారు. భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బుచ్చెయ్యపేట : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, 9 రకాల పండ్ల రసాలతో అమ్మవారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు పూజలు చేశారు. లోపూడిలో అమ్మవారి మండపం వద్ద 5వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, తురకలపూడి, రాజాం, గున్నెంపూడి తదితర గ్రామాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


సీతయ్యపేటలో అమ్మవారికి ఫల రసాలతో అభిషేకాలు

నర్సీపట్నం : నర్సీపట్నం శ్రీదుర్గామల్లేశ్వర స్వామి, బలిఘట్టం శ్రీదుర్గాదేవి ఆలయంతో పాటు ప్రత్యేక మండపాలలో దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు అయిన శనివారం దుర్గాదేవి అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి విశేషంగా పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.


గాయత్రీ దేవీ అవతారంలో మాడుగుల దేవితల్లి

గాయత్రీ దేవీ అవతారంలో..

మాడుగుల : మాడుగులలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు శనివారం గాయత్రీదేవి అవతారంలో దేవీతల్లి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన ఆలయంలో గాయత్రీ అవతార ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనువాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దసరా పాక వద్ద శనివారం సాయంకాలం ప్రముఖ భరత నాట్యకురాలు మామిడి ప్రసన్న లక్ష్మి, బృందం ప్రదర్శించిన భరత నాట్యం చూపరులను కట్టిపడేసింది. అనంతరం శ్రీకృష్ణ మోదమాంబ కల్చరల్ యూనియన్ మహిళలు ప్రదర్శించిన కోలాటాలు కూడా ప్రత్యేక ఆకర్షనగా నిలిచాయి.

బదిలీ అయిన ఉద్యోగులకు ఆత్మీయ సత్కారం


వీరవల్లి సచివాలయంలో బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : వీరవల్లి అగ్రహారం సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు శనివారం సచివాలయంలో గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి కోరుకొండ జగదీష్, సచివాలయ పంచాయతీ కార్యదర్శి పాలకుర్తి, నవ్య శ్రీ, వెల్ఫేర్ సహయకుడు రఘును సన్మానించారు. గ్రామ సర్పంచ్ యలగాడ కామలక్ష్మి, ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గుణమ్మా, తో పాటు యలగాడ ఈశ్వరావు, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు, హరికృష్ణ, తో పాటు పంచాయితీ పాలకవర్గ సభ్యులు, దేశం పార్టీ నాయకులు పాచిల నాగేశ్వరావు, తదితరులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

కరెన్సీతో అమ్మవారికి అలంకరణ


కె.జె.పురం కళావేదిక మీద ప్రతిష్టించిన అమ్మవారికి పది రూపాయల నోట్లతో అలంకరణ


అన్నపూర్ణాదేవి అలంకరణలో వంటర్లపాలెం కనకదుర్గ అమ్మవారు

మాడుగుల రూరల్ : శరనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కె.జె.పురం కళావేదిక మీద ప్రతిష్టించిన దేవి అమ్మవారికి స్థానిక భక్తుడు ఆడారి బాలు శనివారం పది రూపాయల నోట్ల (రూ.3వేలు) దండను అమ్మవారికి సమర్పించారు. ఆర్చకులు విశ్వనాథ సుబ్బారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు రాపేట జోగినాయుడు, ఆడారి నారాయణరావు పాల్గొన్నారు. అలాగే వంటర్లపాలెం కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. గురుమాత దండి నర్సింగరావు సారథ్యంలో భవానీ భక్తులు పాల్గొన్నారు. కె.జె.పురం శివాలయంలో పార్వతీదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి అష్ట లక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరిపారు.

ఘనంగా నూకాంబిక విగ్రహ ప్రతిష్ట


ఆలయంలో ప్రతిష్టించిన అమ్మవారి విగ్రహం

మాకవరపాలెం: నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. మండలంలోని అడిగర్లపాలెం గ్రామంలో ఇటీవల నూతనంగా నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి శనివారం అమ్మవారి విగ్రహాన్ని వైభవంగా ప్రతిష్టించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అడిగర్ల సింహాచలం, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.